# పసిపాదాలు



ఒమ్మి రమేష్‌బాబు

**జూన్‌నెల రెండో వారం. సాయంత్రం.**

**మబ్బులతో పాటు ఆకాశం కూడా కరిగి వర్షపు చినుకులుగా రాలుతోంది. అప్పటి వరకూ గుంపులు గుంపులుగా ఎగిరిన తూనీగలు అదృశ్యమయ్యాయి. పద్మినీ, భావన్నారాయణ- దానవాయిపేట వీధిలో వర్షంలో తడుస్తూ నడుస్తున్నారు.**

"మాస్టారూ! మీకు వర్షంలో తడవటం ఇష్టమా?" పద్మిని అడిగింది.

"వర్షంలో తడవటం నీకెంత ఇష్టమో, నాకూ అంతే ఇష్టం"

భావన్నారాయణ జవాబుకి పద్మిని ముసిముసిగా నవ్వింది.

పద్మిని ప్రకాష్‌నగర్ హైస్కూల్లో పదో తరగతి చదువుతోంది. భావన్నారాయణ ఆ స్కూల్లో లెక్కల మాస్టారు. పద్మిని ఇల్లు దానవాయిపేట పార్కు దగ్గరి తూర్పువీధిలో. భావన్నారాయణ ఇల్లు బైపాస్ రోడ్డు దగ్గర. ఉదయాన్నే తొమ్మిదింటికి ఆయన నడుస్తూ స్కూలుకి వస్తాడు. సాయంత్రం స్కూలు వదిలాకా పద్మిని చెప్పే కబుర్లు వింటూ ఇంటికి వెళతాడు.

వేసవి సెలవుల తర్వాత స్కూళ్ళు తెరిచీ నాలుగు రోజులయ్యింది. ఈ నాలుగు రోజులూ, నాలుగు వర్షసాయంత్రాలూ వేసవి సెలవుల విశేషాలు చెప్పుకోవడంతోనే గడిచిపోయాయి.

"మాస్టారూ! చిన్నప్పుడు మీరూ వర్షంలోకి కాగితప్పడవలు వొదిలారా?"

"వొదిలాను. వర్షధారల్లో కాగితప్పడవల వెంట పరుగులెత్తాను. నోటు పుస్తకాల్ని చించి పడవలు చేసినందుకు మా నాన్న చేతుల్లో చాలాసార్లు దెబ్బలు కూడా తిన్నాను"

భావన్నారాయణకి పద్మిని అడిగే ప్రశ్నలు ఇష్టం. పద్మినికి ఆయన చెప్పే జవాబులు ఇష్టం. గత మూడేళ్ళ నుంచీ ఇష్టమైన ప్రశ్నలూ, ఇష్టమైన జవాబులతో ఇద్దరూ ఆ దారిన నడుస్తున్నారు. చిరపరిచితమైన రహదారి, మొక్కలు, పువ్వులు, పరిమళాలు, పిట్టలు, సాయం సంధ్య.

పద్మిని క్లాసు పుస్తకాలు వర్షానికి తడవకుండా గుండెలకి ఆన్చుకుని నడుస్తోంది. వర్షంలో నిశ్శబ్దంగా పరవశంగా తడుస్తున్న చెట్లని చూస్తో అడుగులో అడుగేస్తున్నాడు భావన్నారాయణ.

వర్షం పుంజుకుంది. ఒక భావధారలా ఏకదాటిగా కురుస్తున్న చినుకులు. చినుకుల మధ్య నుంచి చల్లగాలి వలయవలయాలుగా తాకుతోంది.

"మాస్టారూ! మీరు చిన్నతనంలో ఈ స్కూల్లోనే చదువుకున్నారు కదూ?" దానవాయిపేట మున్సిపల్ ఎలిమెంటరీ స్కూలుని చూపిస్తూ అడిగింది పద్మిని.

"అవునవును. చిన్నప్పుడు నేను ఈ స్కూల్లోనే చదువుకున్నాను. అప్పటికీ, ఇప్పటికీ ఆస్బెస్టాస్ రేకుల కింద ఆ స్కూలు బిల్డింగ్ అలాగే వుంది. పార్కులోని ఇసుకలో కూర్చుని పరీక్షలు రాసేవాళ్ళం. ఇక్కడే జారుడుబల్ల దగ్గర, బాదం చెట్టు నీడల్లోనూ నేను ఆడుకున్నాను. అవునూ, నేనిక్కడే చదువుకున్నానని నీకెలా తెలుసు?" భావన్నారాయణ కుతూహలంగా అడిగాడు.

"మా అమ్మ చెప్పింది"

పద్మిని మురిపెంగా జవాబిచ్చింది. చిన్నపిల్లలు దోబూచులాట ఆడేప్పుడు వాళ్ల గుండెల్లోనూ, గొంతులోనూ తొంగి చూసే మురిపెం లాంటి మురిపెం అది. చల్లని వర్షం చినుకుల స్పర్శకి పద్మిని పెదాలు వొణుకుతున్నాయి. ఆకాశంలో మేఘాలు ఘర్జిస్తూ మెరుపులీనుతున్నాయి.

భావన్నారాయణ గొంతులోకి వొంద ప్రశ్నలు వచ్చాయి. అప్పటికే ఇద్దరూ పార్కు తూర్పువీధిని చేరుకున్నారు. ఆ వీధి సమీపించగానే పద్మిని వడివడిగా నడుస్తూ ఇంటికి వెళ్ళిపోయింది. భావన్నారాయణ ఒక్కడూ మెరిసే ఆకాశాన్ని చూస్తూ వర్షపు చినుకుల్లో ముందుకి నడిచాడు.

## 2

ఉదయం. ఎండ మిసమిసలాడుతోంది. ఆకాశం నీలవర్ణంతో మెరుస్తోంది. అక్కడక్కడా మబ్బుతునకలు అల్లుకుంటున్నాయి.

ప్రకాష్‌నగర్ హైస్కూలు. అడ్మిషన్ల హడావిడితో హెడ్మాస్టర్ రూమ్ రద్దీగా వుంది. స్టాఫ్ రూమ్‌లో కూర్చుని టీచర్లంతా తరగతుల వారీగా హాజరుపట్టీలు తయారుచేస్తున్నారు. స్కూలు ఫైనల్ పరీక్షలు రాసిన విద్యార్థుల కోసం భావన్నారాయణ టీసీలు ఫిలప్ చేస్తున్నాడు.

పద్మిని ఎనిమిదో తరగతి చదువుతుండగా క్లాసులీడర్‌గా ఎన్నికయ్యింది. తొమ్మిదో తరగతిలోనూ ఆమెకు పోటీలేదు. మళ్ళీ ఎన్నిక జరపకపోయినా పదో తరగతికి కూడా తనే క్లాసులీడర్‌గా వ్యవహరిస్తోంది.

టీచర్లంతా ఎక్కువ సమయం స్టాఫ్‌రూమ్‌లోనే గడపవలసిరావడంతో పిల్లల అల్లరి అదుపు తప్పుతోంది. టెన్త్‌క్లాస్ విద్యార్థులు మాత్రమే మహా నిశ్శబ్దంగా వున్నారు. భావన్నారాయణకి ఆశ్చర్యం వేసింది. ఆయన తన చేతిలోని రిజిస్టర్‌ని డెస్క్‌మీద పెట్టీ ఆ నిశ్శబ్దాన్ని అన్వేషిస్తూ వెళ్ళాడు.

నిజంగా అబ్బురపరిచే సన్నివేశమే! పద్మిని బ్లాక్ బోర్డు ముందు నిలబడి రంగురంగుల చాక్‌పీస్‌లతో బొమ్మ గీస్తోంది. 'ఆకాశం, ఎగిరే కొంగల బారు, కలువల కొలను, పచ్చని చేనుగట్లు'- కనువిందైన లేండ్‌స్కేప్. ఆ పసిరేఖల్లో జీవం తొణికిసలాడుతోంది. రంగులద్దడంలో చక్కని నేర్పరితనం వుంది. బొమ్మ దాదాపు పూర్తికావొస్తోంది. క్లాస్‌రూమ్‌లో అందరూ తమని తాము మర్చిపోయారు. ఏకాగ్రతతో పద్మిని గీస్తున్న చిత్రంలోకి చూస్తున్నారు. రాత్రి ఆకాశంలో చందమామ దిక్కుగా చూపు తిప్పిన చుక్కల్లా వున్నారంతా!

తన రాకవల్ల ఆ నిశ్శబ్దమూ, ఏకాగ్రతా చెదిరిపోవడం భావన్నారాయణకి ఇష్టంలేదు. చప్పుడు కాకుండా ఆయన స్టాఫ్ రూమ్‌లోకి తిరిగొచ్చాడు. తన కుర్చీలో కూర్చుని ఆకాశాన్ని చూశాడు. అంతా ఒక పెద్ద కాన్వాస్‌లా వుంది. ఆ నీలం రంగు కాన్వాస్ మీద అక్కడక్కడా తెల్లరంగు అద్దినట్టుగా వున్నాయి మేఘశకలాలు.

కథ



పద్మిని అంటే అందుకే ఆయనకంత ముచ్చట. తను బొమ్మలేస్తుంది. ఆటలాడుతుంది. పిల్లల చేత ఆడిస్తుంది, పాడిస్తుంది. అల్లరి పిల్లలతో కలిసీ తనూ అల్లరి చేస్తుంది. క్లాస్‌రూమ్‌లో వరల్డ్‌మేప్ పెట్టమని హెడ్మాస్టర్‌ని పోరుతుంది. సైన్స్ లాబ్‌లో అవసరమైన పరికరాలు కొనమని లిస్టు తయారు చేసి సైన్స్ మాస్టారు చేతికిస్తుంది. ఈ ఏడాది స్కూలు తెరిచిన రెండో రోజే క్లాసురూములు శుభ్రంగా లేవని ఫిర్యాదు చేసింది. తరగతుల వారీగా విద్యార్థుల్ని టీములుగా ఏర్పరచి గదులూ, బెంచీలూ, వరండా, మైదానం- శుభ్రం చేయించింది. తనూ ఆ పనిలో ఉత్సాహంగా పాల్గొంది. క్లాస్‌రూమ్ కిటికీలోంచి వెచ్చవెచ్చని ఉదయకాంతి తొంగిచూస్తుండగా ఈ రోజు డ్రాయింగ్ టీచర్ మల్లే చక్కని బొమ్మ గీస్తోంది.

ఆకాశంలో ఎండ కొద్దికొద్దిగా పదునెక్కింది. సూర్యుడు మేఘశకలాల్ని తప్పించుకుంటూ నడినెత్తికొచ్చాడు.

## 3

సాయంసంధ్య. ఏటవాలుగా కురుస్తోంది ఎండ. తూర్పుదిక్కున మేఘాలు కూడుతున్నాయి.

లాంగ్‌బెల్ మోగిన కొద్ది నిముషాల తరువాత భావన్నారాయణ స్టాఫ్‌రూమ్ నుంచి బయటికొచ్చాడు. ఆయన కోసమే పద్మిని ఎదురుచూస్తోంది. క్రమం తప్పని దినచర్య- నడక. ఇద్దరూ ప్రకాష్‌నగర్ దాటి దానవాయిపేట వీధిలోకి వచ్చారు. ఇద్దరి మీదా చల్లని ఎండ పడుతోంది.



"మాస్టారూ! మీరు చిన్నప్పుడు క్లాసు పుస్తకాల నిండా నెమలిపింఛాల్ని దాచుకునేవారా?"

పద్మిని రెప్పలార్పకుండా భావన్నారాయణ ముఖంలోకి చూస్తూ అడిగింది. అలల్లా వీస్తున్న గాలికి ఆమె ముంగురులు రెపరెపలాడుతున్నాయి.

"నాకు చిన్నప్పుడు నెమలి పింఛాలంటే భలే ఇష్టం వుండేది. నా దగ్గర ఏ పుస్తకాన్ని తెరిచినా నెమలి పింఛాలే కనిపించేవి. పుస్తకాల్ని ఎంత జాగ్రత్తగా దాచుకునేవాణ్ణో, నెమలి పింఛాల్నీ అంతే జాగ్రత్తగా దాచుకునే వాణ్ణి. వాటన్నిటినీ ఎప్పుడు పోగొట్టుకున్నానో గుర్తులేదు నాకు"

ఆయన గొంతు బాల్యంలోకి జారుకుంది. ఆయనకి తన పసితనపు పరుగులూ, పంతాలూ, అలకలూ గుర్తుకొస్తున్నాయి.

"మాస్టారూ! మీ నాన్నగారు ట్యూషన్లు చెప్పేవారటగా?"

"అవును. మా నాన్నగారు మున్సిపల్ హైస్కూలులో లెక్కలు మాస్టారు. సాయంత్రాలు ఇంటి దగ్గర ట్యూషన్లు. ఆయన వారసత్వమేమో, నా బుర్రకీ లెక్కల పాఠాలే వొంటబట్టాయి"

భావన్నారాయణ చెప్తున్న ప్రతి మాటనీ.పద్మిని మనసు పెట్టి వింటోంది. మొన్నమొన్నటి వరకూ మాస్టారు సంగతులేవీ ఆమెకి తెలియవు. మొన్నీమధ్యనే కోటగుమ్మం మార్కెట్‌కి తన తల్లితో వెళ్ళినప్పుడు భావన్నారాయణ కనిపించాడు. ఆయన ఒక్కడూ భుజానికి సంచి తగిలించుకుని జనంలోంచి జనంలోకి పోతున్నాడు. ఒకళ్ళనొకళ్ళు చూసుకోలేదు కానీ సమీపంగానే నడుస్తున్నారు. అప్పుడే పద్మిని తన తల్లికి చూపించింది మాస్టారుని: "అదిగో, సన్నగా పొడవుగా వున్నారే, ఆయనే మా లెక్కల మాస్టారు భావన్నారాయణ. ఆయనతోనే కలిసి రోజూ నేను స్కూలు నించి ఇంటికి నడిచొస్తాను" అని చెప్పింది.

పద్మిని తల్లి భావన్నారాయణని పట్టిపట్టి చూసింది. ఆమె కళ్ళు ఆయనని పోల్చుకున్నట్టుగా మెరిశాయి. ఆమె నుదురు దరహాస రేఖలతో విశాలమైంది.

"ఆయనేనా మీ మాస్టారు. ఆయనని నేను ఎరుగుదును. ఇద్దరం ఒకే స్కూల్లో చదువుకున్నాం. ఆయన నాన్నగారి దగ్గరే నేను ట్యూషను చెప్పించుకునే దాన్ని" అన్నది. అలా ఆనాడు మార్కెట్ నుంచి తిరిగొచ్చాకా, అప్పుడూ అప్పుడూ ఆమె భావన్నారాయణకి సంబంధించిన సంగతులన్నీ ఎంతో గుర్తుగా పద్మినికి చెప్తూకొచ్చింది. ఆ విషయాలనే ఇప్పుడు పద్మిని మాస్టారు దగ్గర ప్రస్తావిస్తోంది- ఎంతో ఆసక్తిగా కళ్ళెగరేస్తూ.

భావన్నారాయణ పద్మిని తలమీద చేయివేసి దగ్గరగా నడుస్తున్నాడు. ఒక వేడుకలా గడిచిపోయిన బాల్యంలోకి నడుస్తున్నట్టుగా నడుస్తున్నాడు.

"మాస్టారూ! మీరు చిన్నప్పుడు బొమ్మరిళ్ళు కట్టుకుని ఆడుకునే వారట కదా? అప్పటి మీ అల్లరి గుర్తుందా?" ఆనాటి సంగతులన్నీ దగ్గరగా చూసినట్టే అడిగింది పద్మిని. ఆ విషయాలు నీకెలా తెలుసని అడగడం కంటే అప్పటి రోజుల్ని గుర్తు చేసుకోవడంలోనే ఆనందం వుంది. అందుకే భావన్నారాయణ ఎదురు ప్రశ్నలు వేయకుండానే జవాబులిస్తున్నాడు:

"నిజమే! బాగా గుర్తుచేశావు. మరీ చిన్నతనం. అంటే అప్పటికి నేను నాలుగోతరగతి చదువుతున్నాను. మా పొరుగింట్లో నాకొక చిన్ని స్నేహితురాలుండేది. తను శారద! ఇద్దరం ఒకే క్లాసు. ఒకే జట్టు. మా నాన్నగారి దగ్గర ఇద్దరం ట్యూషను చెప్పించుకునే వాళ్ళం. శారద ఇసుకతో గూడు కట్టేది. నేను కొబ్బరాకుని తెంచి బొమ్మలు చేసేవాణ్ణి. ఆ బొమ్మలకు పెళ్ళి చేసేవాళ్ళం. లక్కపిడతల్లో శెనగపప్పు, బెల్లం, మిఠాయిలు వేసుకుని సంబరంగా ఆడుకునే వాళ్ళం. ఓ రోజు మేం ఆడుకుంటున్నప్పుడు శారద నా మీద కోపగించింది. నేను ఇంట్లోంచి దొంగతనంగా తీసుకువచ్చిన శెనగపప్పు, బెల్లం ఇసుకలోకి విసిరికొట్టింది. నేను కోపంతో ఆమెని కొట్టేను. తనూ నన్ను కొట్టింది. నేను నా చేతికందిన రాయి తీసుకుని ఆమె చేతిమీద గట్టిగా కొట్టేను. నేను కొట్టిన దెబ్బకి శారద చేతినుంచి చాలా రక్తం కారింది"

భావన్నారాయణ ముఖం గంభీరతలోకి మారిపోయింది. ఆకాశంలో పిట్టల సందడి కూడా తగ్గింది.

"అప్పుడేం జరిగింది?" పద్మిని రెట్టించింది మళ్ళీ.

"ఏం జరిగిందీ! మా నాన్నగారు వొళ్ళు వాచేలా నన్ను కొట్టేరు. తన దగ్గర నా చదువు సరిగా సాగడంలేదని, నన్ను విశాఖలోని మా అమ్మమ్మ ఇంటికి పంపించేశారు"

ఇద్దరూ మెల్లమెల్లగా నడుస్తున్నప్పటికీ దానవాయిపేట పార్కు చేరువయ్యింది. తూర్పువీధి రానేవచ్చింది. పద్మిని భావన్నారాయణకి మరోసారి విష్‌చేసి ఇంటికి వెళ్ళిపోయింది.

భావన్నారాయణ ఒక్కడూ నడుస్తున్నాడు. ఎదురుగా సంధ్య. సందిగ్ధసంధ్య.

'నా చిన్నప్పటి విషయాలన్నీ పూసగుచ్చినట్టు అడుగుతోందే!' అని పద్మిని మాటల్ని తల్చుకుని ఆయన ఆశ్చర్యపోయాడు. చల్లగాలి జల్లుజల్లుగా వీస్తోంది. దాని చలన సంచలనాల్ని దాటుకుంటూ ఆయన నడుస్తున్నాడు.

## 4

ఉదయం పదకొండు గంటలు. తూర్పు ఆకాసాన ఎండ మిసమిసలాడుతోంది. పశ్చిమం నుంచి మేఘాలు కమ్ముకొస్తున్నాయి. గాలి ఆగాగి వీస్తోంది.

టీచర్లకి పని వొత్తిడి తగ్గింది. భావన్నారాయణ స్టాఫ్‌రూమ్‌లో తనకి అలవాటైన కుర్చీలో కూర్చునివున్నాడు. ఆయన కెదురుగా ఇంగ్లీష్ టీచర్ జయశ్రీ, సైన్స్ మాస్టారు వేణుమాధవ్ కుర్చున్నారు. విడిగా వున్న మరో టేబుల్ చుట్టూ మిగతా టీచర్లు కూర్చున్నారు. అప్పుడు ప్రస్తావనకొచ్చింది 'స్కూల్ పీపుల్స్ లీడర్' (ఎస్.పి.ఎల్) ఎన్నిక గురించి.

"ఈ ఏడాది రవిచంద్రని ఎస్‌పిఎల్‌గా ఎంపిక చేద్దామని అనుకుంటున్నాం" అన్నాడు వేణుమాధవ్. ఆయనకి మద్దతుగా తలాడిస్తూ భావన్నారాయణ ఎలా స్పందిస్తాడోనని ఎదురుచూసింది జయశ్రీ.

"రవిచంద్ర కాదు, పద్మిని ఎస్‌పిఎల్‌గా వుండాలి. ప్రతీయేడు ఎవరైతే టెన్త్‌క్లాస్‌కి లీడర్‌గా వుంటున్నారో, వాళ్ళనే ఎస్‌పిఎల్‌గా ఎంపిక చేస్తున్నాం కదా?" భావన్నారాయణ వేణుమాధవ్ ప్రతిపాదనకి సవరణ సూచించాడు.

"పద్మిని క్లాసులీడర్‌గా ఇంకా ఎంపికవలేదుగా?"

"క్లాసులీడర్‌గా విద్యార్థులు ఎవర్నీ ఎన్నుకోకుండానే రవిచంద్రని ఎస్‌పిఎల్‌గా ఎలా నిర్ణయించారూ?"

భావన్నారాయణ ఎదురు ప్రశ్నించాడు. ఆయన ప్రశ్న వేణుమాధవ్‌కి మింగుడు పడలేదు. వాళ్ళు ఆయన మాటలతో ఏకీభవించకపోవడానికి ఒక కారణం వుంది. రవిచంద్ర హెడ్మాస్టర్ రమణమూర్తి కొడుకు. ఆయన ప్రాపకం కోసమే వేణుమాధవ్ ఎస్‌పిఎల్ ఎన్నికలో చొరవ తీసుకోవాలని ప్రయత్నించాడు. లేకపోతే ఇలాంటి అంశాల్లో

అతని జోక్యం వుండనే వుండదు. భావన్నారాయణ ఇలా ఎదురు ప్రశ్నిస్తాడని అతనూహించలేదు.

"రవిచంద్ర ఫస్టుర్యాంకు విద్యార్థి. అతనే ఎస్‌పిఎల్‌గా వుంటాడు" పట్టుదలగా అన్నాడు వేణుమాధవ్.

"చదువుకీ, ఈ ఎన్నికకీ ఏమాత్రం సంబంధంలేదు. అయినా అలా నిర్ణయించడానికి మనవెవరం? విద్యార్థులే ఎస్‌పిఎల్‌ని ఎన్నుకుంటారు"

"మనకా హక్కుందని నా ఉద్దేశం"

"హక్కుల గురించి మాట్లాడే ముందు పిల్లల్ని కూడా గుర్తుపెట్టుకోవాలి" మరింత గట్టిగా అన్నాడు భావన్నారాయణ. ఇద్దరి మధ్యా వాదన పెరిగింది. విషయం హెడ్మాస్టర్ వరకూ వెళ్ళింది. ఆయన ముందు కూడా భావన్నారాయణ తగ్గలేదు. "ఎస్‌పిఎల్‌ని ఎన్నుకోవాల్సిన బాధ్యత విద్యార్థులదే. వాళ్ళే ఎన్నుకుంటారు" అని ఖచ్చితంగా చెప్పాడు. ఆ రకంగా ఎస్‌పిఎల్ ఎన్నికలో మొదటిసారిగా ఇద్దరు విద్యార్థుల మధ్య పోటీ ఏర్పడింది. స్కూలు చరిత్రలో అటువంటి పోటీ జరగడం అదే మొదటిసారి. మరో నాలుగు రోజుల్లో ఎస్‌పిఎల్ ఎన్నిక జరపాలని హెడ్మాస్టర్ సమక్షంలో టీచర్లంతా నిశ్చయించారు.

## 5

సాయంసంధ్య మేఘాలలోకి ఇంకిపోయింది. మధ్యాహ్నమనగా ఆకాశాన్ని ముసుగుకప్పిన మేఘాలు కరగనారంభించాయి.

వర్షం కురుస్తోంది- మెత్తమెత్తగా. చినుకులు పడుతుండగానే భావన్నారాయణ, పద్మిని స్కూల్లోంచి రోడ్డుమీది కొచ్చారు. ముత్యాల పందిరి కింద నడుస్తున్నంత ఆనందంగా ఇద్దరూ వర్షంలో నడుస్తున్నారు. ఉదయం స్కూల్లో జరిగిన సంగతులన్నీ పద్మినికి తెలుసు. అందుకే భావన్నారాయణ మళ్ళీ ఆ విషయాల్ని ప్రస్తావించలేదు.

అప్పుడప్పుడూ భావన్నారాయణ అరచేతిని చాచి వర్షం చినుకుల్ని అందుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. అతని చేతుల్లో పడి చినుకులు చిట్లిపోతున్నాయి. చెదిరిపోతున్నాయి.

"వర్షం అంటే శారదకి ఎంతో ఇష్టం" అన్నాడు పద్మినితో.

"శారద ఎవరూ?" నిన్నటి సంభాషణ గుర్తులేనట్టే అడిగింది పద్మిని.

"శారద అంటే నా చిన్ననాటి స్నేహితురాలు"

వర్షానికి తోడు జ్ఞాపకాల వర్షం. చినుకు వెంట చినుకు. తడిసిన తలవెంట్రుకల నుంచి వర్షం నీళ్ళు పెదాల మలువుల్లోకి జారుతున్నాయి.

"గడిచిపోయిన రోజుల్ని తల్చుకుంటే చిత్రమైన అనుభూతులు కలుగుతాయి. తెగిపోయిన స్నేహాలూ, బంధుత్వాలూ మళ్ళీ కావాలనిపిస్తాయి. శారద స్కూలుకి వెళ్ళకపోతే నేనూ వెళ్ళే వాణ్ణి కాదు. నేను వెళ్ళక పోతే తనూ వెళ్ళేది కాదు. ఒకసారి నేను అల్లరి చేశానని స్కూల్లో ఎండలో నిలబెట్టారు. కొద్దిసేపటికి నేను కళ్ళుతిరిగి పడిపోయాను. శారద ఒకటే ఏడుపు. ఏడ్చుకుంటూ మా ఇంటికి వెళ్ళి మా నాన్నగారిని వెంటబెట్టుకు వచ్చింది"

"శారద మీకంతగా గుర్తుందా మాస్టారూ?"

"నాకు జ్ఞాపకం వుంది కానీ, నువ్వీ మధ్య మరీ దగ్గరగా గుర్తుచేశావు. నేను శారదని రాయితో కొట్టిన తర్వాత మా నాన్నగారు విశాఖ పంపించేశారు కదా! అక్కడికి వెళ్ళాకా- నా స్కూలు, చదువు, స్నేహాలూ అన్నీ మారిపోయాయి. కొత్త వాతావరణంలోకి మెల్లమెల్లగా వెళ్ళగలిగాను. కానీ నాకు మాత్రం అస్తమానం శారద గుర్తుకొచ్చేది. ఒక్కణ్ణీ పారిపోయి రావాలనిపించేది. అయిదో తరగతి చదువుతున్న వయస్సు నాది. నన్ను మా అమ్మమ్మ ఒంటిగా ఎక్కడికీ వెళ్ళనిచ్చేది కాదు. వూరు నాకు కొత్త కావడంతో నన్ను వేయి కళ్ళతో కాచుకునేది. నేను రాజమండ్రి వెళ్తానని గొడవ చేసినప్పుడల్లా ఉత్తరం రాసి మా అమ్మానాన్నల్ని అక్కడికే రప్పించేది. రాజమండ్రి విడిచి వెళ్ళిన వాణ్ణి దాదాపు రెండేళ్ళపైగా విశాఖలోనే వుండిపోయాను. ఏడో తరగతి పరీక్షలు రాసింతర్వాత నేను ఇంటికి వచ్చాను. కానీ శారదని కలవలేదు. ఆమెని కలవాలంటే సిగ్గు, ఆమెని కొట్టానన్న అపరాధ భావం. అవే నన్ను దూరాన వుంచాయి. అంతే- తర్వాత పబ్లిక్ పరీక్షలు, డిగ్రీలు, టీచర్ ట్రైనింగులూ, ఉద్యోగం, పెళ్ళీ. ఒకదాని వెంట ఒకటి. ఆ ప్రవాహంలోనే నేను వుండిపోయాను"

వర్షంలో తడిసే కొద్దీ చినుకులు వెచ్చని అనుభూతుల్ని పంచుతున్నాయి. పద్మినీ, భావన్నారాయణల చుట్టూ వర్షసాయంత్రపు ఏకాంతం అల్లుకుంది. చినుకుల సవ్వడి వినసొంపుగా వుంది.

"అవునూ, నా విషయాలన్నీ మీ అమ్మకి ఎలా తెలుసూ?" నిన్న చివరిసారిగా అడగాలనుకున్న ప్రశ్నని ఈ రోజు అడిగాడు భావన్నారాయణ.

"మా అమ్మకి మీ విషయాలు ఎలా తెలుసో చెప్తాగానీ, శారద మీకు ఎదురుపడితే మీరేం చేస్తారు చెప్పండి"

"శారద ఎదురుపడేదాకా ఎందుకాగాలీ, నేనే ఆమెని వెతుక్కుంటూ వెళ్తాను"

"మీరు వెతుక్కుంటూ వెళ్ళనక్కరలేదు లెండి"

"ఎందుకూ?"

"ఎందుకంటే- మా అమ్మే శారద కాబట్టి!"

గత కొన్నాళ్ళుగా దాచిపెడుతూ వచ్చిన రహస్యాన్ని నవ్వుతూ చెప్పేసింది పద్మిని. భావన్నారాయణకి అలాంటి వూహ వచ్చినా, ఆ వూహ నిజమవుతుందని అనుకోలేదు. 'శారదే మా అమ్మ' అని చెప్పి దొంగాట మాదిరిగా ఆయనకి అందకుండా వర్షంలో ముందుకి పరిగెత్తింది పద్మిని. ఆయన కూడా పొంగివస్తున్న నవ్వుని దాచుకుంటూ పద్మిని వెంట పరుగుతీశాడు. తన చిన్ననాటి స్నేహితురాలిని కలుసుకునే దాకా ఆ పరుగు కొనసాగుతూనే వుంది.

## 6

నాలుగు రోజులు గడిచాయి. ఎస్‌పిఎల్ ఎన్నికలో టీచర్ల ప్రమేయం వుండకూడదని ముందే భావన్నారాయణ నియమం పెట్టాడు. పదో తరగతి విద్యార్థులు ఎవరినైతే క్లాసులీడర్‌గా ఎన్నుకుంటారో, వాళ్ళే ఎస్‌పిఎల్‌గా కొనసాగుతారు. ఇది స్కూలు సంప్రదాయం.

వేణుమాధవ్ పట్టుదలగా వున్నాడు. భావన్నారాయణ అంతకంటే పట్టుదలగా వున్నాడు. టీచర్ల మధ్య పంతాలు రావడంతో ఎన్నిక పట్ల ఆసక్తి పెరిగింది. పదకొండు గంటలు కావొస్తుండగా భావన్నారాయణ, వేణుమాధవ్, మరో నలుగురు టీచర్లు పదో తరగతికి వచ్చారు. వాళ్ళు రాగానే పద్మిని, రవిచంద్ర విద్యార్థుల ముందుకొచ్చి నిల్చున్నారు. ఆ ఇద్దరిలో ఎవరు తమకి క్లాసులీడర్‌గా వుండాలో కోరుకుంటూ, వారి పక్షాన మిగతా విద్యార్థులు చేతులెత్తి మద్దతు తెలుపుతారు.



భావన్నారాయణ మౌనంగా వున్నాడు.

వేణుమాధవ్ పిల్లల్ని ఉద్దేశించి ఇలా అన్నాడు:

"రవిచంద్ర క్లాసు లీడర్‌గా కావాలనుకునే వాళ్ళు చేతులెత్తండి"

క్లాసురూములోని విద్యార్థుల్లో దాదాపు సగం మందికిపైగా చేతులెత్తారు. క్లాసులో అరవైమంది వుంటే వారిలో ముప్ఫయి ఆరుగురు చేతులెత్తారు. అంటే రవిచంద్ర పక్షాన ఎక్కువ మద్దతు వున్నట్టే! వేణుమాధవ్ ఆనందం అవధులు దాటింది. ఆయన తేరుకునే లోగానే భావన్నారాయణ అడిగాడు:

"పద్మిని క్లాసులీడర్‌గా వుండాలని కోరేవాళ్ళు చేతులెత్తండి"

స్పందన చిత్రంగా వుంది! తరగతి గదిలో వున్న మొత్తం విద్యార్థులు చేతులెత్తారు. ఇందాక రవిచంద్ర పక్షాన చేతులెత్తిన విద్యార్థులు కూడా ఇప్పుడు పద్మిని తరఫున చేతులెత్తారు. వేణుమాధవ్‌కి ఈ పరిణామం అర్థం కాలేదు. అసలు వూహించలేకపోయాడు- ఇలా జరుగుతుందని. పెదాలపైన నవ్వుని పేర్చుకుంటూ నిశ్శబ్దంగా ఆయన ఒక్కడూ క్లాసురూము నుంచి వెళ్ళిపోయాడు. పద్మినికి మద్దతుగా పదోతరగతి విద్యార్థులు కొడుతున్న చప్పట్లు ఆయన చెవులని తాకుతున్నాయి. ఆ తర్వాత పద్మిని అన్ని తరగతుల విద్యార్థుల మధ్యకీ వెళ్ళి తన ఎన్నికని తెలిపింది. చప్పట్లతో ఆమోదాన్ని అందుకుంది.

సాయంత్రం స్కూలు వదిలేసరికీ భావన్నారాయణ స్టాఫ్‌రూములో లేడు. అప్పటికే ఆయన వెళ్ళిపోయాడు. పద్మిని ఒక్కర్తే ఇంటికి వచ్చింది. ఆమెకి గుమ్మంలోనే భావన్నారాయణ కనిపించాడు. తన మిత్రురాలు ఇచ్చిన టీని ఇష్టంగా తాగుతూ, ఇష్టంగా దావమీద కూర్చున్నాడు. ఆయనకెదురుగా వున్న కుర్చీలో కూర్చుని శారద కూడా టీ తాగుతోంది.

"అమ్మా! నేను ఎస్‌పిఎల్‌గా ఎన్నికయ్యానే" పద్మిని శారద చేతుల్లోకి వొదిగిపోతూ చెప్పింది.

"నువ్వు అందర్నీ గెల్చుకోగలవు తల్లీ!" అన్నది శారద- కూతుర్ని లాలిస్తూ. ఆ తల్లీకూతుళ్ళ లాలనలోంచి తన చిన్నతనాన్ని అన్వేషిస్తూండిపోయాడు భావన్నారాయణ.

●

**వర్షం కురుస్తోంది- మెత్తమెత్తగా. చినుకులు పడుతుండగానే భావన్నారాయణ -పద్మిని స్కూల్లోంచి రోడ్డుమీది కొచ్చారు. ముత్యాల పందిరి కింద నడుస్తున్నంత ఆనందంగా ఇద్దరూ వర్షంలో నడుస్తున్నారు.**